

# స్వచ్ఛాంధ్ర అవార్డులతో స్ఫూర్తి

● కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ● 48 మందికి స్వచ్ఛాంధ్ర పురస్కారాలు ప్రదానం




స్వచ్ఛాంధ్ర పురస్కారాలు అందుకున్న వారితో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితిసింగ్, ప్రభుత్వ విప్ ఆదినారాయణరెడ్డి తదితరులు



స్వచ్ఛాంధ్ర పురస్కారాల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న స్వచ్ఛాంధ్ర-2025 అవార్డులు ప్రజల్లో స్వచ్ఛత స్ఫూర్తిని నింపాయని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో జరిగిన స్వచ్ఛాంధ్ర అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి, జేసీ అదితిసింగ్, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రజల్లో చైతన్యం పెంచుతోందన్నారు. పారిశుధ్య కార్మికులు నిజమైన హీరోలని చెప్పారు. ప్రతి పౌరుడు ఇంటి నుంచే స్వచ్ఛత ఆచరణ ప్రారంభిస్తే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛతకు మహిళలే మార్గదర్శకులని తెలిపారు. మన జిల్లా స్వచ్ఛమైన, కాలుష్యరహిత జిల్లాగా నిలవాలన్నారు. జేసీ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర అవార్డులు జిల్లాల పనితీరును ప్రతిబింబిస్తున్నాయన్నారు. ఈ అవార్డులు మరిన్ని సంస్థలకు స్ఫూర్తినిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం జిల్లా స్థాయి అవార్డులు పొందిన 48 మందికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ వేడుకలో జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజారోగ్యశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

### సీఎం చేతుల మీదుగా పురస్కారం

చెన్నూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మేజరు గ్రామ పంచాయతీ చెన్నూరును స్వచ్ఛాంధ్ర పురస్కారానికి ఎంపికచేయడంతో సోమవారం విజయవాడలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డును పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి అందుకున్నారు. జిల్లా పంచయాతీ అధికారి రాజ్యలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో సురేశ్‌బాబు, పంచయాతీకార్యదర్శి రామసుబ్బారెడ్డి స్వచ్ఛంధ్ర కార్యక్రమానికి విజయవాడ వెళ్లారు. అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చేతుల మీదుగా ఈ అవార్డును గ్రామ పంచాయతీ కార్యదర్శి అందుకున్నారు.




సీఎం చేతుల మీదుగా స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంటున్న చెన్నూరు పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి

### నా అదృష్టంగా భావిస్తున్నా



ఉదయం ఐదున్నర గంటలకు లేచి ఇంటింటికి వెళ్లి తడి చెత్త, పొడిచెత్తను వేరు చేసి సేకరించడం, వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించడం నా దైనందిన కర్తవ్యం. ఈ విజయానికి రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు, ప్రజలు అందించిన సహకారం మరువలేనిది. ఈ అవార్డు అందుకోవడం నా అదృష్టం.

- భాస్కర్, పులివెందుల మున్సిపాలిటీ

### సంతోషంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛాంధ్ర పురస్కారాలు- 2025లో కడప మున్సిపాలిటీకి జిల్లాస్థాయి అవార్డు దక్కింది. ఇందుకు నా వంతుగా కేటాయించిన దాదాపు 400ఇళ్లలో ఉదయన్నే లేచి తడిచెత్త పొడిచెత్త వేరు చేసి సేకరించి క్లీన్ కడపలో భాగమైనందుకు సంతోషంగా ఉంది.

- రవి, కడప కార్పొరేషన్

### మిద్దెపైన కూరగాయల సాగు



స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సేంద్రియ ఎరువులను ఇంటిలోనే తయారుచేసుకుని, ఏడాది నుంచి మా ఇంటి రూఫ్‌పైన మొక్కల పెంపకంతో స్వచ్ఛమైన కూరగాయలను పండించి తింటున్నాం. దీనిని మిగతా వారు ప్రేరణగా తీసుకోవడం సంతోషంగా ఉంది.

- అనురాధ, సోనియా సమాఖ్య సొసైటీ

## ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి : ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడారు. చట్టపరమైన పరిమితుల్లో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలని ఆదేశాలు జారీచేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసుశాఖ ద్వారా పరిష్కారం అయ్యే ప్రతి సమస్యను ప్రజలు స్వేచ్ఛగా తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. కాగా.. సోమవారం ఎస్పీ కార్యాలయానికి 147 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి పాల్గొన్నారు.

## రెండో అంతస్తు నుంచి దూకి..
## విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కడప క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రిమ్స్‌లోని దంత వైద్య కళాశాలలో బీడీఎస్ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థిని పరీక్షలు బాగా రాయలేనని ఆందోళనకు గురై హాస్టలు భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. నంద్యాల జిల్లాకు చెందిన విద్యార్థిని ప్రభుత్వ దంత వైద్యశాలలో ఫస్టియర్ చదువుతోంది. వీరికి కొన్ని రోజుల నుంచి పరీక్షలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఫస్టియర్ ఫైనల్ పరీక్ష సోమవారం ఉదయం 11గంటలకు రాయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థిని తాను పరీక్షలు బాగా రాయలేనని ఆవేదనకు గురైంది. ఉదయం నిద్ర లేచి హాస్టలు భవనంలోని రెండో అంతస్తులో తన బెడ్‌రూముకు సమీపంలో ఉన్న డోరు తెరవగానే బాల్కనీ కనిపించింది. అప్పటికే ఒత్తిడిలో ఉన్న విద్యార్థిని వెంటనే అక్కడికి వెళ్లి కిందకు దూకేసింది. వెంటనే సహచర విద్యార్థినిలు అధికారులకు రిమ్స్ పోలీసులకు సమాచారం అందజేశారు. తీవ్రంగా గాయపడ్డ విద్యార్థినిని రిమ్స్ క్యాజువాలిటీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కడప నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. రిమ్స్ సీఐ రామకృష్ణారెడ్డి ఆసుపత్రికి చేరుకుని విద్యార్థిని స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్


కడప కలెక్టరేట్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో అర్జీలు సమర్పించే బాధితుల సమస్యలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరిగింది. కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ సమస్యలపై అర్జీలను అందజేశారు. వారి విన్నపాలు స్వీకరించిన మీదట తదుపరి చర్యలకై సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ వెంకటపతి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలు అధ్వానం : తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలు రోజురోజుకు క్షీణిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. అటు వైసీపీ, ఇటు టీడీపీ కూటమి రాష్ట్రానికి రాహు కేతువులుగా దాపురించాయని తెలిపా రు. వైసీపీ ప్రభుత్వం గత సంవత్సరాలలో రాష్ట్రాన్ని అప్పుల, అరాచక, మద్య, గంజాయి, డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా తయారు చేసిందని తెలిపారు. ప్రస్తుతం కూటమి పాలనలో పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తమైందని, రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాల కింద రూ.6400 కోట్లకు గాను ఇటీవల కేవలం రూ.400కోట్లు మాత్రమే విడుదల చేశారని దీని వలన కళాశాలల యాజమాన్యాలు, ఇటు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాగే ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదని, మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో పలుచోట్ల రోజూ తెల్లవారుజామున వర్షం కురుస్తోంది. అర్ధరాత్రి వరకూ చుక్కలతో మిలమిలలాడే ఆకాశం.. తెల్లారి చూసేప్పటికి మబ్బులతో కమ్ముకుని ఉంటోంది. సోమవారం తెల్లవారుజామున కడపలో వర్షం కురిసింది. చెమ్మెక్కిన మేఘాలు సేదతీరుతున్నట్లు పాలకొండలపై పరచుకుని సంద్రాన్ని తలపించాయి. కొండలకు ఆనుకుని ఆకుపచ్చని అడవి, రైలు పట్టాలు కనువిందు చేశాయి. రిమ్స్ సమీపంలోని బ్రిడ్జిపై నుంచి ఈ సుందర దృశ్యాలను పలువురు తమ కెమెరాల్లో బంధించారు.

ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప




## కౌలు కార్డు రెన్యువల్ చేయలేదని
## దరఖాస్తుకు నిప్పంటించిన రైతు



దరఖాస్తు ఫారానికి నిప్పంటించిన కౌలు రైతు వెంకటక్రిష్ణయ్య

పోరుమామిళ్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతుకు సంబంధించిన కార్డును రెన్యువల్ చేయడంలో రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తున్నారంటూ అగ్రహారంకు చెందిన కటారి వెంకటక్రిష్ణయ్య అనే కౌలు రైతు సోమవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట దరఖాస్తు ఫారానికి నిప్పంటించి నిరసన తెలిపారు. డౌన్ డౌన్ రెవెన్యూ డిపార్ట్‌మెంటు అంటూ నినాదాలు చేశారు. రైతులను తిప్పుకుంటున్నారే తప్ప వారికి న్యాయం చేయడం లేదన్నారు. గ్రామాల్లో సచివాలయాలు ఉన్నా సంబంధిత అధికారులు నెలలతరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారే తప్ప స్పందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయంపై తహశీల్దారు చంద్రశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా, ఈ సంఘటనపై విచారణ జరిపి కౌలు రైతుకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

### ఆదర్శం.. ఆ గురుకులం

● గుండ్లకుంట పాఠశాలకు స్వచ్ఛాంధ్ర పురస్కారం

5

## ఆసుపత్రిలో అవినీతిపై విచారణ

● ఫిర్యాదుదారులను విచారించిన కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని ల్యాబ్‌లో జరుగుతున్న అవినీతిపై సోమవారం డాక్టర్ సునీల్, డాక్టర్ చంద్రకళ, చీఫ్ ఫార్మసిస్టు మమతల టీం విచారణ చేపట్టింది. ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై డీసీహెచ్ఎస్ అధికారిణి హిమదేవి విచారణ కమిటీని నియమించింది. కొందరు ట్రైనీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లు సైతం డీసీహెచ్ఎస్‌కు ఫిర్యాదు చేశారు. వారిని కూడా ఒక్కొక్కరిని విచారించారు. ల్యాబ్‌లల్లో ఎవరెవరు, ఏవిధంగా అవినీతికి పాల్పడేవారనేది లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు స్వీకరించారు. ప్రభుత్వ ఆసుపత్రి ల్యాబ్ నుంచి రక్త పరీక్షలు సొంత ల్యాబ్‌లకు ఏవిధంగా తీసుకెళ్లేవారు, పరికరాలు ఎలా బయటకి తరలించేవారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా కొన్ని ఆధారాలు రావాల్సి ఉందని విచారణ కమిటీ సభ్యులు డాక్టర్ సునీల్ తెలిపారు. ల్యాబ్ ఇన్‌చార్జి సరళాను కూడా విచారించామన్నారు. రెండు మూడు రోజుల్లో విచారణ నివేదికను డీసీహెచ్ఎస్‌కు అందజేస్తామన్నారు. కాగా ఈ విచారణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యాధికారిణిని తమ వద్దే కూర్చోపెట్టి బృందం విచారించడంతో కొందరు ట్రైనీ విద్యార్థులు వాస్తవాలు చెప్పడానికి ఇబ్బంది పడినట్లు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. విచారణ కమిటీలో ఉండే ఇద్దరు డాక్టర్లు ఇక్కడ పనిచేసి ఇటీవలే వెళ్లిన వారు కావడంతో వీరు ల్యాబ్‌లో అక్రమాలకు పాల్పడిన వారి చిట్టా బయటకు తీస్తారా లేదా క్లోజ్ చేస్తారా అనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.



రాజుపాళెం మండలం కానగూడూరులో రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్నలపై కప్పిన పట్టలు, నిలిచిన వర్షం నీరు

## ఉల్లికి దెబ్బ



మైదుకూరు మండలంలో వర్షపు నీటిలో మునిగిన ఉల్లి పంట

మైదుకూరు రూరల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి పంటలు నీట మునిగి నష్టపోయా మని రైతులు వాపోతున్నారు. మైదుకూరు మండలంలోని తిప్పి రెడ్డిపల్లె, ముసల్‌నాయినిపల్లె, కొత్తపల్లె తదితర గ్రామాలలో సోమవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో ఈ ప్రాంతంలో రైతులు ప్రధానంగా సాగుచేసే ఉల్లి, పసుపు, వరి పంటలు నీటమునిగాయి. కోత దశకు వచ్చిన ఉల్లి పూర్తిగా మునిగి పోవడంతో ఉల్లిగడ్డలు కుళ్లిపోతా యని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.




# మొక్కజొన్న వర్షార్పణం

రాజుపాలెం/దువ్వూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగైన మొక్కజొన్న కోత దశకు రావడంతో నూర్పిళ్లు జోరుగా జరుగుతున్నాయి. రైతులు నూర్పిడి చేసిన మొక్కజొన్నలను ఆరబెట్టగా సోమవారం ఉదయం కురిసిన వర్షానికి తడిచి ముద్దయ్యాయి. భారీ వర్షానికి మొక్కజొన్నలు పూర్తిగా నానడంతో రూ.2వేలు క్వింటా పలుకుతున్న ధర మరింత తగ్గిపోయే అవకాశం ఉందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రాజుపాళెం మండలంలో 400 ఎకరాల్లో సాగైన ఈ పంట కోత దశకు రావడంతో రెండు కిలోమీటర్ల మేర రోడ్లపైన ఆరబోశారు. రోజూ వర్షం నీటితో పట్టలు కప్పి రక్షించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. మూడురోజులుగా మండలంలోని వివిధ గ్రామాల్లో మినుము, నూగు సాగు చేశారు. వీటిని సాగుచేసిన తరువాత వారం రోజుల వరకు వర్షం పడకూడదు. అయితే ఒక్కసారిగా భారీ వర్షం పడడంతో నేల పైపొర గట్టిపడి సరిగా మొలక రావని రైతులు వాపోతున్నారు. ఈ వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు విత్తనాలను 80శాతం సబ్సిడీతో అందించాలని బాధిత రైతులు కోరారు.

### దువ్వూరు మండలంలో..

దిగుబడులు చేతికందేవేళ దువ్వూరు మండలంలో వర్షం చేటు తెచ్చింది. ఉల్లి, జొన్న, మినుము రైతులను కంటతడి పెట్టించింది. పెద్దబళ్లారి రకం ఉల్లిపంట కోత దశకు చేరగా, జొన్న పంటను తొలగించి ఆరబెట్టే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కొన్ని చోట్ల రెండు మూడు రోజులుగా మినుము పంట విత్తుతున్నారు. ఈదశలో సోమవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఉదయం వరకు జోరుగా వర్షం కురిసింది. ఉల్లి కోత దశకు చేరిన సమయంలో పొలాల్లో వర్షపునీరు నిలిచింది. ఆరబెట్టిన మొక్కజొన్నలు తడిసిపోయాయి. వేలాది రూపాయలు పెట్టుబడుల కింద వెచ్చిస్తే చేతికొచ్చిన పంటల పరిస్థితి సంకటస్థితిలో పడింది. కాగా.. రబీ పంటలుగా మండల పరిధిలో జొన్న, మినుము ఇటీవల సాగు చేశారు.

ఈ రైతుల్లోనూ ఆందోళన నెలకొంది. మండల వ్యాప్తంగా 47.4 మి.మీ వర్షం నమోదైంది. పసుపు, వరి సాగుదారులకు మాత్రం ఈ వర్షం మేలు చేకూర్చుతుందని రైతులు అంటున్నారు.

## జీఎస్టీ తగ్గింపుతో రైతులకు లబ్ధి

**సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై కలెక్టర్ నిశాంత్‌కుమార్**



వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

రాయచోటిటౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమయ్యే వ్యవసాయ పరికరాల కొనుగోలులో జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. సోమవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై రాయచోటి పట్టణంలోని మాసాపేటలో గల వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయ, ఉద్యానవనశాఖలు సంయుక్తగా రైతులకు, ప్రజలకు అవగాహన కోసం ఎగ్జిబిషన్‌తో పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నూతన జీఎస్టీ విధానం వల్ల రైతులకు అవసరమయ్యే ట్రాక్టర్లు, డ్రిప్పులు, స్ప్రింక్లర్లపైన ఐదు శాతం జీఎస్టీ మాత్రమే ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గుర్రం సుబ్బయ్యనాయుడు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శివనారాయణ, ఉద్యానవన శాఖ, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది, పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కారు, ద్విచక్ర వాహనం ఢీ : రైతు మృతి



కారు,ద్విచక్రవాహనం ఢీకొన్న దృశ్యం, మృతి చెందిన రఘునాథరెడ్డి

కురబలకోట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-మదనపల్లె ప్రధాన జాతీయ రహదారిలోని దొమ్మన్నబావి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు అక్కడిక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎర్రబల్లి పంచాయతీ తూగువారిపల్లెకు చెందిన రఘునాథరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా ఆయన సొంత పనుల నిమిత్తం అంగళ్లకు తన ద్విచక్రవాహనంలో వెళుతుండగా దొమ్మన్నబావి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.

కాగా ఈ ప్రమాదంలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించారు. సంఘటనా స్థలానికి ముదివేడు ఎస్సై దిలీప్‌కుమార్ చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చికిత్స పొందుతూ టీడీపీ కార్యకర్త మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

రాయచోటి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన టీడీపీ కార్యకర్త దేరంగుల వెంకటేశ్వర్లు (32) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పెమ్మాడపల్లి పంచాయతీ గరుగుపల్లికి చెందిన వెంకటేశ్వర్లు శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతుండగా రాయచోటి పట్టణ పరిధిలోని ఇనాయత్‌ఖాన్ చెరువు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది.

దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని బెంగళూరుకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇతనికి భార్య, ప్రణీత్, మోక్షిత్ అనే కుమారులు ఉన్నారు. ఈయన ఐటీడీపీ కన్వీనర్‌గా కూడా పనిచేశాడు. దీంతో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్ బాబు రాయచోటి ఏరియా ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## విద్యార్థిపై దాడి కేసులో విచారణ

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు కొట్టడంతో విద్యార్థి చూపు కోల్పోయిన సంఘటనపై సోమవారం మదనపల్లె పోలీసులు విచారణ చేశారు. వివరాలిలా ఉన్నాయి. తంబళ్లపల్లి నియోజకవర్గం బి.కొత్తకోట సమీపంలోని గట్టు గ్రామ పంచాయతీ గట్టు వద్ద ఏర్పాటైన రిషి వాటిక గురుకుల పాఠశాలలో మండలంలోని కాలాడివాండ్లపల్లెకు చెందిన శేషాద్రిరెడ్డి చదువుకునేవాడు.

గత నెలలో ఉపాధ్యాయుడు కొట్టడంతో ఆ విద్యార్థి కంటి చూపు కోల్పోయాడు. ఇందుకు సంబంధించి విద్యార్థి సొంత ఊరైన కాలాడివాండ్లపల్లె వచ్చిన పోలీసులు తల్లిదండ్రులను విచారణ చేశారు. తమకు న్యాయం చేయాలని విద్యార్థి తల్లిదండ్రులు ఈ సందర్భంగా పోలీసులను కోరారు.

# అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం..

- చెక్‌డ్యాంలు కొట్టుకుపోయి ఏళ్లు
- అయినా మరమ్మతులకు నోచుకోని వైనం
- 'కూటమి'లోనైనా మరమ్మతు పనులు జరిగేనా



కుమ్మరవాని ఒడ్డు పూర్తిగా కొట్టుకుపోయిన దృశ్యం



ఒడ్డుకు అమర్చిన రాళ్లు భారీ వర్షాలకు కొట్టుకుపోయి దిగువ ప్రాంతాలకు చేరిన దృశ్యం



ముళ్లకంపలతో పూర్తిగా ముసుకుపోయిన కుమ్మరవాని ఒడ్డు ప్రాంతం

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోనే అత్యంత వెనుకబడిన మండలం పెద్దతిప్పసముద్రం. ఈ మండలంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన చెరువులుగా కందుకూరు వ్యాసరాయసముద్రం, పీటీఎం తిప్పరాయసముద్రం, రంగసముద్రం రంగరాయ చెరువులు ఉన్నాయి. ఎగువ ప్రాంతంలో కురిసే వర్షాలకు నీరు చెరువులకు చేరి నిండి మొరవ ప్రవహిస్తే దిగువ ప్రాంతాలకు నీరు వృథాగా వెళ్లాయి. ఈ నీటిని నిలువ చేసి ఆ నీటితో మెట్ట ప్రాంత రైతులు పంటలను పండించుకునేందుకు వీలుగా గతంలో వాగులు వంకలపై చెక్‌డ్యాం నిర్మాణాలు చేపట్టి ఆయకట్టు రైతులు పంటలను సాగు చేసుకునే వారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన 2021-22లో ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో మండలంలోని ప్రధాన చెరువులు నిండి భారీగా నీటి ప్రవాహం రావడంతో దిగువ ప్రాంతంలో నిర్మించిన చెక్‌డ్యాంలు పూర్తిగా కొట్టుకుపోయాయి.

### కొట్టుకుపోయి మూడేళ్లు..

పెద్దతిప్పసముద్రం మండలంలోని బూర్లపల్లె గ్రామం కొత్తపల్లె సమీపంలో గత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తంబళ్లపల్లె నియోజకవర్గం అప్పటి ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకర్‌రెడ్డి చెక్ డ్యాంకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి భారీ స్థాయిలో చెక్ నిర్మించడంతో కొత్తపల్లె, శ్రీనివాసరాయునిపల్లె, మడుమూరు గ్రామాలకు చెందిన సుమారు 300 ఎకరాల ఆయకట్టు భూమికి నీళ్లు అంది పంటలను పండించుకునేవారు. కొన్ని రోజులకు పీటీఎం చెరువుకు భారీగా వరద రావడంతో కొట్టుకుపోయింది. తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వంలో తిరిగి మరమ్మతులు చేయడంతో ఈ గ్రామాల రైతులు మళ్లీ పంటలను సాగు చేశారు. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. 2021-22లో పీటీఎం మండలంలో భారీగా వర్షాలు కురవడం చెరువులు భారీగా మొరవలు పోవడంతో చెక్‌డ్యాం పూర్తిగా కొట్టుకుపోయింది. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఆయకట్టు రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అతీగతీ లేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

### చెక్‌డ్యాం వైపు కన్నెత్తిచూడని అధికారులు

పీటీఎం పెద్ద చెరువు మొరవ ద్వారా వెళ్లే మిగులు జలాలు అధిక శాతంగా నీరు వెళుతోందని ఈ నీటిని నిలువ ఉంచగలిగితే మూడు గ్రామాలకు చెందిన సుమారు 300 వందల మంది రైతులకు లాభం చేకూరుతుందని, కొత్తపల్లె, శ్రీనివాసరాయునిపల్లె, మడుమూరు గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు తమ గోడును వెళ్లిబుచ్చుకుందామని రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే ఇరిగేషన్ అధికారులను కలవాలని సలహాలు ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇరిగేషన్ అధికారులకు తమ గోడును చెప్పుకుందామంటే ఇరిగేషన్ అదికారులు ఎక్కడ ఉంటారో, ఎప్పుడు వస్తారోనని రైతులు అంటున్నారు. ఈ చెక్ డ్యాం పూర్తిగా కొట్టుకు పోవడంతో నీరు వృథాగా దిగువ ప్రాంతాలకు వెళ్లి పోతుండడంతో ఈ గ్రామాల్లో నీరు అడుగంటి పోయి తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు.

### రైతుల ఎదురుచూపు

గత వైసీపీ ప్రభుత్వంలో చెక్‌డ్యాంలు, కాలువలు, వాగులు, వంకలు భారీ వర్షాలకు పూర్తిగా ధ్వంసమైనా గత పాలకులు పట్టించుకోకపోవడంతో నీరు నిల్వ లేకుండా వచ్చిన నీరు వచ్చినట్లుగా వృథాగా దిగువ ప్రాంతాలకు వెళ్లిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి రైతులకు గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో వాగులు వంకలు, చెరువులు అనే తేడా లేకుండా ఇసుకను భారీ యంత్రాలతో తోడేయడంతో భూగర్భ జలాలు అడుగంటి గ్రామాల్లో కరువుఛాయలు అలుముకున్నాయి. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా ధ్వంసమైన చెక్ డ్యాంలను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి ఆయకట్టు రైతులను ఆదుకుంటారని ఎదురు చూస్తున్నారు.

### ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం..

మండలంలోని బూర్లపల్లె పంచాయతీ కొత్తపల్లె, చల్లావాండ్లపల్లె, మడుమూరు, శ్రీనివాసరాయునిపల్లె, బొంతవారిపల్లె, రంగసముద్రం, తోటవారిపల్లె తదితర గ్రామాల్లో కొట్టుకుపోయిన సుమారు 10 చెక్ డ్యాంలను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పనులను ప్రారంభించి చెక్‌డ్యాంల మరమ్మతు పనులు చేపడతాం.

- సతీష్‌గౌడ్, ఇరిగేషన్ జేఈ

## పట్టాభిరాముడికి పవిత్రాల సమర్పణ



ధ్వజస్తంభం వద్ద పవిత్రాల సమర్పణ చేస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిరామాలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ మొదలుకుని ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో విశేషాలంకరణలు చేసి పూజలు నిర్వహించారు.

ఆలయ మండపంలో ఉన్న పవిత్రాలను టీటీడీ అధికారులతో కలిసి ప్రదక్షిణగా తీసుకువెళ్లి మూలవర్లకు, భోగోత్సవమూర్తులైన సీతారామలక్ష్మణులకు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం మొదలుకుని దేవతా మూర్తుల ప్రతిమలకు పవిత్రాలను సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ మునిబాల, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## చెయ్యేటికి మళ్లీ వరద నీరు

- ధ్వంసమైన తాత్కాలిక రోడ్లు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు



పెనగలూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల ఆదివారం సాయంత్రం నుంచి చెయ్యేటికి భారీగా వరదనీరు వచ్చింది. వరదనీటి ప్రవాహంతో ఓబిలి-టంగుటూరు మధ్య ఉన్న మట్టిరోడ్డు, కోడిచెన్నయ్యగారిపల్లె, పల్లంపాడు మధ్యనున్న మరో మట్టి రోడ్డు కొట్టుకుపోయాయి. రెండు వారాల కిందట పించా ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయడంతో ఈ రెండు రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. స్థానిక నాయకులు ట్రాక్టర్లతో మట్టి రాళ్లు తోలి మరమ్మతులు చేస్తున్నారు. అయితే అకస్మాత్తుగా ఆదివారం సాయంత్రం వరద నీరు రావడంతో రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో సోమవారం ఉదయం నుంచి నాలుగు గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి.

నీటి ఉధృతికి కొట్టుకుపోయిన ఓబిలి-టంగుటూరు మట్టి రోడ్డు

## డ్రోన్ సాయంతో 17మంది జూదరుల అరెస్టు

- *17 సెల్‌ఫోన్స్, రూ.4.44 లక్షల నగదు స్వాధీనం*

మదనపల్లె అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ సాయంతో 17 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 17 సెల్‌ఫోన్లు, 10 ద్విచక్రవాహనాలతో పాటు రూ.4,44,050 నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. మదనపల్లె నియోజకవర్గంలోని నిమ్మనపల్లె మండలం దిగువపల్లెలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సోమవారం నిమ్మనపల్లె పోలీసులు డ్రోన్ సాయంతో మెరుపుదాడులు జరిపి నిమ్మనపల్లె ఎస్‌ఐ తిప్పేస్వామి ఏడుగురు జూదరులను, ఏడు సెల్‌ఫోన్లు, రూ.20,850 నగదును స్వాధీనం చేసుకున్నారు.

అలాగే మదనపల్లె మండలం బండకాడపల్లె సమీపంలో పేకాట స్థావరాలపై మదనపల్లె తాలుకా సీఐ కళా వెంకటరణ దాడులు చేసి పది మంది జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4,23,200 నగదు, ఐదు మోటార్‌సైకిళ్లు, 12సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోగా మరికొంత మంది పారిపోయారన్నారు. మదనపల్లెకు చెందిన అర్జున్‌రెడ్డి, రమేశ్ పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నట్లు తెలిసిందని, వారు పరారీలో ఉన్నారని, వారిపై కేసు నమోదు చేశామని, త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.



మదనపల్లె మండలం బండకాడపల్లెలో జూదరులను అరెస్టు చేస్తున్న పోలీసులు

## ఎర్రచందనం కేసులో ఇద్దరి అరెస్ట్



వివరాలు తెలుపుతున్న అర్బన్ సీఐ వెంకటాచలపతి

రాయచోటి టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎర్ర చందనం అక్రమ రవాణా కేసులో తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి తిరుపతిలోని ఎర్రచందనం స్పెషల్ కోర్టుకు తరలించినట్లు రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి తెలిపారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. 2021 అక్టోబరులో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులు దాడి చేయడంతో కడప జిల్లా చెన్నూరు మండలం శ్రీరామనగర్, కొక్కరాయపల్లెకు చెందిన కొలిమి సుభాన్‌బాషా, అర్జున్ పారిపోయారన్నారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న నిందితులు ఆదివారం సాయంత్రం రాయచోటి గాలివీడు రింగురోడ్డు వద్ద వాహనాలు తనిఖీలో తాను, ఎస్‌ఐ బాలకృష్ణ సిబ్బందితో కలిసి అరెస్టు చేసినట్లు తెలియజేశారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేసిన అనంతరం కోర్టుకు తరలించినట్లు వివరించారు.

## అంతర్రాష్ట్ర బైక్ దొంగ అరెస్టు



దొంగ అరెస్టు చూపుతున్న మదనపల్లె డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతరాష్ట్ర బైక్ దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. సోమవారం మదనపల్లె తాలుకా పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నిందితుడి అరెస్టు వివరాలను వెల్లడించారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన పులి వెంకటరెడ్డి (33) అన్నమయ్య, బాలాజీ జిల్లా, కర్ణాటకలోని కోలారు జిల్లాల్లో 45 మోటార్ సైకిళ్లు దొంగతనం చేసి పోలీసులకు పట్టుబడ్డాడని తెలిపారు. ఇతడి వద్ద నుంచి రూ.13,50,000 విలువ చేసే వివిధ రకాల 25 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని, ఇంకా 20 మోటార్ సైకిళ్లు ఉన్నాయని, వాటిని ట్రేసౌట్ చేస్తున్నట్లు తెలిపారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ, ఎస్‌ఐ చంద్రమోహన్ తమ సిబ్బంది కలిసి మదనపల్లె మండలం చుట్టుపక్కల ప్రాంతాల్లో, మండలాల్లో జరుగుతున్న మోటార్ సైకిళ్లపై నిఘా ఉంచారన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ మదనపల్లె-పుంగనూరు రోడ్డు ఆంజనేయస్వామి ఆలయం వద్ద పులి వెంకటరెడ్డిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.

## 16న జిల్లాలో మందకృష్ణ పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న డానియల్

పీలేరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 16న జరగనున్న మందకృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ కోట డానియల్ పిలుపునిచ్చారు. పీలేరులోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సోమవారం ఆయన నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగకుండా ఉద్యమాలు చేసిన మందకృష్ణకు జిల్లాలో ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయన కేవలం మాదిగల రిజర్వేషన్‌ల కోసమే కాకుండా రోగులకు ఆరోగ్యశ్రీ, ప్రత్యేక ప్రతిభావంతులకు పింఛన్లు సాధించిన ఘనత కూడా ఆయనదేనన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్ర, గండికోట వెంకటేశ్, రామమోహన్ రెడ్డి, వెంకటేశ్, అమరనాథరెడ్డి, రెడ్డప్ప, రాము, రాజేశ్, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

# పనులు సరే...బిల్లులేవీ?

- వామ్మో మేము పనులు చేయలేము...
- చేసిన పనులకు బిల్లులు రాక..
- కాంట్రాక్టర్ల ఎదురుచూపులు

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది ఇక కాంట్రాక్ట్ పనులను విచ్చలవిడిగా చేసేద్దాం అన్న కూటమి నేతలు ఇప్పుడు వామ్మో మేము పనులు చేయలేము అనే పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనుల కాంట్రాక్ట్ బిల్లులు చెల్లింపులకు సంబంధించిన సమస్యలు పరిష్కారమవుతాయని చాలామంది ఆశించారు. అయితే వారి ఆశలు అడియాశలయ్యాయి. ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఒకటిన్నర సంవత్సరం పూర్తవుతున్నప్పటికీ కాంట్రాక్టర్లకు చాలామందికి ఇంకా బిల్లులు అందకపోవడంతో వారు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కూటమి నేతలు పంచాయతీలకు మంజూరైన నిధులతో చిన్నపాటి సమస్యలను పరిష్కరించుకున్నప్పటికీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద చేసిన పనులకు సంబంధించిన నిధులు ఇంతవరకు విడుదల కాలేదు. నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.16 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టారు. అయితే ఈ పనులకు సంబంధించిన నిధులలో కేవలం 40 శాతం మాత్రమే ఇప్పటివరకు అందాయి. మిగిలిన 60 శాతం నిధులు ఎప్పుడు వస్తాయో తెలియక కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి పనులు చేపట్టిన నేతలు ఇప్పుడు వడ్డీలు కట్టుకుంటూ లబోదిబోమంటున్నారు. కోడూరు మండలంలోని ప్రధానమైన రెడ్డివారిపల్లి వంతెన పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయి. అయినప్పటికీ ఇప్పటివరకు కనీసం ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల కాలేదు. నిధులు ఎప్పుడు వస్తాయో అర్థం కాక కూటమి నేతలు పనులు చేయడానికి భయపడుతున్నారు.

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు పనులను మొదలుపెట్టాలని ప్రయత్నించనప్పటికీ నిధులు వస్తాయో రావో అనే అయోమయంలో ప్రతినిధులు ఉన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలోపు గ్రామాలలో ప్రధానమైన రోడ్ల పనులను చేపట్టాలని లేని పక్షంలో ఎన్నికలకు వెళ్లే పరిస్థితి ఉండదని నేతలు భయపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లుల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేయాలని స్థానిక నేతలు, కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

80 శాతం పూర్తయిన రెడ్డివారిపల్లె వంతెన పనులు



### ఒక్క రూపాయి రాలేదు..

- బ్రిడ్జి నిర్మిస్తున్న ఓ కాంట్రాక్టరు

బ్రిడ్జి పనులను 80 శాతం పనులను పూర్తి చేయడం కోసం ఇప్పటికే రూ.10 కోట్లు ఖర్చు చేశాను, ఇప్పటి వరకు కనీసం ఒక రూపాయి రాలేదు. బ్రిడ్జి నిర్మాణంలో వేసిన తాత్కాలిక బ్రిడ్జి అనేకసార్లు వరదలు వచ్చి కొట్టుకుపోయినా అదనపు ఖర్చు చేసి మరలా నిర్మించాను. బ్రిడ్జి నిర్మాణంలో భూమి కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం అందకపోవడంతో వారు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నారు. దీంతో బ్రిడ్జి నిర్మాణం పనుల్లో జాప్యం జరిగింది. త్వరితగతిన బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని లేని పక్షంలో నిధులకు ఆటంకం కలుగుతుందని అధికారులు చెబుతున్నారు. వడ్డీలు భారీగా పెరిగిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్‌ల బాధలను అర్థం చేసుకుని నిధులు విడుదల చేయాలి.

# ఎత్తిపో(కో)తలేనా...!

- అర్ధాంతరంగా ఆగిపోయిన వరికుంట్ల చెరువు ఎత్తిపోతల పథకం
- ప్రసంగాలకే పరిమితమైన వైసీపీ నాయకుల హామీలు
- కూటమి ప్రభుత్వంలోనైనా పనులు ముందుకు సాగేనా



గంగనపల్లె తెలుగుగంగ కాలువ వద్ద అసంపూర్తిగా ఉన్న సంప్ నిర్మాణం



నిరుపయోగంగా ఉన్న పైపులు

కాశినాయన, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) మండలంలోని తెలుగంగ కాలువ పడమరవైపున ఉన్న గ్రామాల ప్రజలు సాగు, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో తెలుగంగ ఎడమ కాలువ ప్రహిస్తున్నప్పటికీ దాదాపు 70 శాతం సాగుభూమికి తెలుగంగ జలాలు అందని పరిస్థితి. ఇటుకులపాడు నుంచి గంగనపల్లె వరకు దాదాపు 9 గ్రామాల ప్రజలు తెలుగంగ జలాలకోసం దశాబ్దాల తరబడి ఎదురుచూపులు చూస్తున్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి రాజకీయ నాయకులు ఎత్తిపోతల ద్వారా తెలుగంగ నీరు ఇటుకులపాడు, సావిశెట్టిపల్లె, వరికుంట్ల, బాలాయపల్లె తదితర గ్రామాల్లోని చెరువులకు, కుంటలకు నీరు అందిస్తామని హామీ ఇస్తున్నా అది నేటికీ కార్యరూపం దాల్చలేదు.

మండలంలోని ఇటుకులపాడు వద్ద 2014-2019 సంవత్సరాలలో టీడీపీ అధికారంలో ఉండగా తెలుగంగ కాలువపై ఎత్తిపోతలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇటుకులపాడు చెరువు నుంచి సావిశెట్టిపల్లె, వరికుంట్ల, బాలాయపల్లె తదితర చెరువులకు లింక్ చానల్ ద్వారా నీరు నింపాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు పలుమార్లు పర్యటించి నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఇంతలో ఎన్నికలు రావడం టీడీపీ అధికారం కోల్పోయి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అయితే అనంతరం అధికారం చేపట్టిన వైసీపీ నాయకులు ఎత్తిపోతల పథకంపై దృష్టి పెట్టలేదు. ఈప్రాంత ప్రజలు ఎత్తిపోతలపై ఎంత మొత్తుకున్నా పట్టించుకున్న పాపానపోలేదు. తీరా ఎన్నికలు సమీ పిస్తున్న తరుణంలో మండల వాసి వైసీపీ ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డిపై ఒత్తిడి పెరిగింది. దీంతో పాత ప్రతిపాదనలు పక్కనబెట్టి కొత్తగా రూ.13కోట్లతో టెండరు ఖరారు చేసి వరికుంట్ల చెరువుకు నీరందించేందుకు ఎత్తిపోతల పథకానికి ఎన్నికలకు 3 నెలల ముందు కడప ఎంపీ అవినాష్‌రెడ్డితో కలిసి ఆగమేఘాలమీదల భూమిపూజ చేశారు. కోడ్ రాకముందే మాప్రభుత్వం అధికారంలో ఉండగానే ఎత్తిపోతల పథకం ప్రారంభించి ఓట్లు అడుగతామంటూ ప్రసంగించారు. కానీ ప్రజలు ఊహించినట్లే జరిగింది. గడువులోగా ఎత్తిపోతల పనులు పూర్తిగా లేదు. దాదాపు 90 శాతం పైప్‌లైన్ పనులు చేశారు గానీ సంప్ నిర్మాణం, మోటార్ల ఏర్పాటు, కరెంట్ సౌకర్యం తదితర కీలకమైన పనులు అర్ధాంతరంగా నిలిచిపో యాయి. అనంతరం వచ్చిన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటిపోయినా కాంట్రాక్టర్ పనులు తిరిగి ప్రారంభించ లేదు. ఇటీవల సావిశెట్టిపల్లె చెరువుకు ఎత్తిపోతల ద్వారా నీరందించే పథకానికి భూమిపూజకు వచ్చిన బద్వేల్ టీడీపీ ఇంచార్జి రితీష్‌రెడ్డి గంగనపల్లె వద్ద అర్ధాంతరంగా ఆగిని ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయించి వరికుంట్ల చెరువుకు నీరందిస్తామని ప్రకటించారు. అయితే పనులు మొదలు పెట్టకపోవడంతో ఈప్రభుత్వంలోనైనా వరికుంట్ల చెరువుకు ఎత్తిపోతల ద్వారా నీళ్లు అందుతాయే లేదోనని ప్రజల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈవిషయంపై సంబంధిత అధికారిని వివరణ కోరగా దాదాపు రూ.11 కోట్లకు పనులు జరిగాయని, కాంట్రా క్టర్‌కు దాదాపు రూ.9 కోట్ల బిల్లులు రావాల్సి ఉందన్నారు. బిల్లులు అందగానే మిగిలిన పనులు పూర్తి చేయిస్తామన్నారు.

## రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చింది వైసీపీనే

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన తన ఇంటి వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె నియోజకవర్గం ములకల చెరువు వద్ద టీడీపీకి చెందిన ఒకరిద్దరు నకిలీ మద్యాన్ని తయారు చేస్తు న్న విషయం బయటకు పొక్కిందన్నారు. వెంటనే అధిష్ఠానం అప్రమత్తమై వారిపై చర్యలు తీసుకుందన్నారు. ఆ నియోజకవర్గంలో నకిలీ మద్యం తయారవుతోందంటే అంతో ఇంతో ఆ నియోజకవర్గ నాయకులకు తెలిసే ఉంటుందని, ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, సురేంద్రలను కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేసిందన్నారు. ఇలాంటి వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్షమించరన్నారు. దీనిపై ఇంకా లోతైన దర్యాప్తు జరపాలని ఆ జిల్లాకు సంబంధం లేని వారిని నియమించి విజిలెన్స్ దర్యాప్తు చేయిస్తున్నారన్నారు. కానీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గోరంతను కొండంత చేసి రాష్ట్రంలో నకిలీ మద్యం తెచ్చి వేలకోట్ల రూపాయలను దోచుకుంటున్నారని రాద్ధాంతం చేస్తున్నారన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చి వేల కోట్ల రూపాయలను దోచుకున్నారన్నారు. ఇష్టమొచ్చిన బ్రాండ్లను తెచ్చి దాదాపు 35 లక్షల మంది ఆరోగ్యాలతో ఆడుకున్నారన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రామ్మోహన్ మృతదేహం

కడప క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వినాయక్‌నగర్ సర్కిల్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామ్మోహన్ (39) అనే వ్యక్తి మృతి చెందాడు. కడప ట్రాఫిక్ సీఐ జావీద్ తన సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సీఐ వివరాల మేరకు.. వల్లూరు మండలం బీచువారిపల్లెకు చెందిన రామ్మోహన్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 14 ఏళ్ల క్రితం ఆయనకు వివాహం కాగా, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. సోమవారం ఉదయం 11.30గంటలకు ఇంటి నుంచి కడపకు ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. వినాయకనగర్ జంక్షన్ వద్దకు సమీపంలోకి రాగానే ఆగి ఉన్న బస్సును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించి మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## శాశ్వత పరిష్కారం చూపాకే పనులు

- టెయిలింగ్‌పాండ్ వద్ద కేకే కొట్టాల ప్రజల ఆందోళన



యూసీఐఎల్ టెయిలింగ్‌పాండ్ వద్ద కేకే కొట్టాల ప్రజల నిరసన

పులివెందుల/వేముల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మా గ్రామానికి శాశ్వత పరిష్కారం చూపాలని.. లేదంటే టెయిలింగ్‌పాండ్ విస్తరణ పనులు సాగనివ్వమని కేకే కొట్టాల గ్రామ ప్రజలు తేల్చి చెప్పారు. సోమవారం టెయిలింగ్‌పాండ్‌కు వెళ్లే దారిలో బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదారేళ్లుగా టెయిలింగ్ పాండ్‌తో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎన్నిమార్లు యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐఎల్) వారికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. 2018, 2021 రెండు దఫాలుగా టెయిలింగ్‌పాండ్ విస్తరణ పనులు చేపట్టారన్నారు. ఆ సమయంలో తీవ్ర నిరసనలు వ్యక్తం చేసినప్పటికీ అప్పటికి హామీలు ఇచ్చి.. వారి పబ్బం గడుపుకున్నారన్నారు. 2018లో జిల్లా కలెక్టర్ హరికిరణ్ ఏడాదిన్నరలోపు మీ సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చినా.. ఇప్పటికీ అమలు కాలేదన్నారు. టెయిలింగ్ పాండ్ కారణంగా భూగర్భ జలాలు కలుషితవుతున్నాయన్నారు. దీంతో తాగునీటికి, సాగునీటికి ఇబ్బందిగా మారిందన్నారు. పంటల సాగుకు వినియోగిస్తున్న బోరు బావుల్లో యురేనియం వ్యర్థాలు కలుస్తూ అనేక అరోగ్య సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మా గ్రామాన్ని పూర్తిగా యూసీఐఎల్ స్వాధీనం చేసుకొని.. ప్రజలంద రినీ వేరేచోటకు పంపించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

## డీకేటి భూముల కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

- ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎదురూరు బాబు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

కడప మారుతీనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దళితులు, మైనార్టీలకు ఇచ్చిన డీకేటి భూములను కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎదురూరు బాబు డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీకేదిన్నె మండలం ఇప్పెంట పంచాయతీ పరిధిలోని కాంపల్లె, ఇప్పెం ట గ్రామాల్లో మాదిగలు, మైనార్టీలకు సంబంధిత గ్రామ రెవెన్యూ పొలంలో 1999 సంవత్సరంలో సర్వే నెం.274లో 28 ఎకరాల భూమిని 22 మంది మాదిగలకు, మైనార్టీలకు 0-75 సెంట్ల డీకేటి భూమిని నాటి ప్రభుత్వం పట్టాలుగా ఇచ్చిందన్నారు. ఆ భూములకు సంబంధిత మండల రెవెన్యూ అధికారులు సర్వే చేయకపోగా హద్దులు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఆ భూముల్లో పంటలు వేస్తూ వ్యవసాయం చేస్తుంటే కొంత మంది బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఆ భూమిని వారే కొన్నట్లుగా దళితులను, మైనార్టీలను భయభ్రాంతలకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి డీకేటి భూమిని వారికి చెందేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్ఎస్ రాజా, మాత య్య, ఎంసీపీ నాయకులు రెడ్డయ్య, సుబ్బరాయుడు, పీఎస్‌యు నాయకులు గోపీ తదితరులు పాల్గొన్నారు.

## బైకు కారు ఢీ....ఇద్దరికి గాయాలు

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బైకు కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు..పోలీసులు అందించిన సమాచారం మేరకు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని కట్టపుట్టాలమ్మ గుడి సమీపంలో తిరుపతి వైపు వెళ్తున్న కారు, కడప వైపు వెళ్తున్న మోటార్ బైకును ఢీకొంది. దీంతో బైకుపై వెళ్తున్న ఓబులవారిపల్లి మండలం బొమ్మవరం గ్రామానికి చెందిన శంకర, రాజంపేటకు చెందిన వెంకట రమణ గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో వారిని కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపారు.

## గండికోట ముంపు బాధితులకు న్యాయమైన పరిహారం

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కడప కలెక్టరేట్/ కొండాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గండికోట ముంపు నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో పాటు న్యాయమైన పరిహారం అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో గండికోట జలాశయ ముంపు వాసులకు పునరావాసం, పరిహారం, మౌలిక సదుపాయాలు కల్పి ంచే అంశమై కలెక్టర్‌తో పాటు జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జేసీ అదితిసింగ్, ఆర్డీవో సాయిశ్రీ, ఎస్డీసీలు శాంతమ్మ, నీలమయ్యలతో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గండికోట రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసి జిల్లాను సస్యశ్యామలం చేసిందన్నారు. నీటి నిల్వ సామర్థ్యం పెంపు విషయంలో మరికొన్ని గ్రామాలు ముంపునకు గురికావడంతో ఆయా గ్రామస్థులకు కూడా పరిహారం, పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. అందుకు సంబంధించి నివాస గృహాలను, లబ్ధిదారులకు వారి పేరుతో ధ్రువీకరణ రిజిస్ట్రేషన్ చేయించి అందించేందుకు తక్షణం చర్యలు చేపడతామన్నారు. కొండాపురం మండలంలో 3 గ్రామాలకు పరిహారం అందాల్సి ఉందన్నారు. మొత్తం 22 గ్రామాల వరకు ముంపునకు గురయ్యాయని, వారందరికీ పరిహారం, పునరావాసం కూడా కల్పించినట్లు తెలిపారు. అలాగే 26 గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించామని, పునరావాసం కల్పించే విషయంలో కొన్ని అంశాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకారం అందాల్సిన పరిహారం, నిధులు, పునరావాస కల్పనలో భాగంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తి స్థాయిలో పనులు చే పట్టాల్సి ఉందన్నారు. సామాజిక ఆర్థిక సర్వే విషయంలో కూడా పూర్తిస్థాయి వివరాలు అందాల్సి ఉందన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ గండికోట రిజర్వాయర్ కోసం భూములు, ఇళ్లను కోల్పోయిన నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పునరావాస కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అనంతరం ముంపు గ్రామాలకు సంబంధించిన సమస్యలపై నిర్వాసితుల నుంచి కలెక్టర్, ఎమ్మెల్యేలు అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా గండికోట నిర్వాసితులు పునరావాసం కింద నిర్మించుకున్న ఇళ్లకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని, హౌసింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. ముంపునకు గురైన తర్వాత కొన్ని పంచాయతీలు పునర్విభజన కాలేదని, వాటిని పునర్విభజన చేయాలన్నారు. కొండాపురం పట్టణంలో ముంపునకు గురైన హైస్కూల్, కాలేజి స్థానంలో వెంటనే కొత్త స్కూల్, కాలేజీని ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ముంపునకు గురైన ప్రభుత్వ ఆఫీసుల స్థానంలో కొత్త ఆఫీసులను నిర్మించాలని కోరారు. కొన్ని కాలనీల్లో శ్మశానవాటికలు, రోడ్లు , డ్రైనేజీలు లేవని, వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు కలెక్టర్, తమ పరిధిలో వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని, మిగిలిన వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ, ఇతర శాఖల అధికారులు, గండికోట నిర్వాసితులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని ఇద్దరికి...

బద్వేలుటౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బయనపల్లె వద్ద సోమవారం సాయంత్రం కారు ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. భావనారాయనగర్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మనోహర్‌రెడ్డి విధులు ముగించుకొని తండ్రి సూర్యప్రకాష్‌రెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంలో స్వగ్రామం సోమేశ్వరం గ్రామానికి బయలుదేరాడు. బయనపల్లె వద్దకు రాగానే కారు ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకువెళ్లారు.

## నేడు మహర్షి వాల్మీకి జయంతి

కడప కలెక్టరేట్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమం మంగళవారం 10-10 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9-30 గంటలకు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎదురుగా ఉన్న వాల్మీకీ విగ్రహానికి పూలమాలలతో అలంకరణ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా అధికారులు, అనధికారులు, బీసీ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## వర్షానికి కూలిన మట్టిమిద్దె

వీరపునాయునిపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వీరపునాయునిపల్లెలోని ఎర్రంపల్లె రహదారిలో ఉన్న నర్రావుల భాస్కర్‌రెడ్డికి చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. సోమవారం తెల్లవారుజాము 4గంటల ప్రాంతంలో కురిసిన వర్షంతో ఉదయం 8గంటల ప్రాంతంలో కూలిపోయింది. ఇంటిలో కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఇంట్లోని సామగ్రి అంతా పనికిరాకుండా పోయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

## రాంగ్ రూటులో వచ్చి.. లారీని ఢీకొన్న కారు

- బ్రేక్ వేయడంతో లారీ వెనుక నాలుగు వాహనాలు ఢీ



ప్రమాదంలో లారీల మధ్యలో పాక్షికంగా దెబ్బతిన్న కార్లు

పుల్లంపేట, అక్టో బరు 6 (ఆంధ్రజ్యోతి) : ముగ్గురు యువకులు మద్యం తాగి కారులో రాంగ్ రూటులో వచ్చి లారీని ఢీకొనడంతో.. లారీ వెనుకవైపున నాలుగు వాహనాలు వరుసగా ఒకదానినొకటి ఢీకొన్నాయి. టిప్పర్ డ్రైవర్ సమయస్ఫూర్తితో రెండు కార్లలో ఉన్న 10 మంది ప్రమాదం నుంచి బయట పడ్డారు. సోమవారం రాత్రి ముగ్గురు యువకులు మద్యం తాగి కారులో రాజంపేట నుంచి రైల్వేకోడూరు వైపు రాంగ్ సైడ్‌లో వెళుతూ ఉడుమువారిపల్లె సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నారు. ప్రమాదాన్ని కొద్ది క్షణాలు ముందుగానే పసిగట్టిన లారీ డ్రైవర్ బ్రేక్ వేయడంతో కారు పాక్షికంగా దెబ్బతింది. కాగా ఈ లారీ వెనుకవైపు మరో లారీతో పాటు రెండు కార్లు వస్తున్నాయి. వాటి వెనకే ముగ్గురాయితో మంగంపేట నుంచి కడపకు వెళుతున్న టిప్పర్ డ్రైవర్ ప్రమాదాన్ని పసిగట్టి పక్కకు తిప్పడంతో కారు వెనుక వైపు సైడ్ ఢీకొంది. దీంతో రెండు కార్లలో ఉన్న 15 మంది సురక్షితంగా బయటపడ్డారు. టిప్పర్ డ్రైవర్ సమయస్ఫూర్తితో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాల కాలేదు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేసి మద్యం మత్తులో ఉన్న యువకులను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

## ఆదర్శం.. ఆ గురుకులం

- గుండ్లకుంట పాఠశాలకు స్వచ్ఛాంధ్ర పురస్కారం
- పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థుల హర్షం



గురుకుల పాఠశాల ప్రధాన భవనం

జమ్మలమడుగు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దముడియం మండలం గుండ్లకుంట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల రాష్ట్రస్థాయి స్వచ్ఛాంధ్ర పురస్కారానికి ఎంపి కైంది. రాష్ట్రంలో స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రకటనలో భాగంగా రెసిడెన్షియల్ స్కూలు విభాగంలో గుండ్లకుంట గ్రామంలోని గురుకుల పాఠశాలకు స్థానం దక్కింది.

గుండ్లకుంట గ్రామంలోని గురుకుల పాఠశాల సుమారు పది ఎకరాల సువిశాల విస్తీర్ణం ఉంది. అన్ని రకాల వసతులతో ఏర్పాటు చేసిన భవన సముదాయం, పాఠశాల ఆవరణలో మొక్కల పెంపకం ఎంతో అందంగా ఆహ్లాదంగా కనిపిస్తుంది. ఇటీవల జిల్లా స్థాయి అధికారుల బృందం ఆదర్శ పాఠశాలల ఎంపికలో భాగంగా పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కల పెంపకం, పరిశుభ్రత, బాత్‌రూం నిర్వ హణ, వంట గదుల శుభ్ర త ఇలా అన్ని రకాలుగా పరిశీలించారు. అలాగే విద్యార్థుల్లో స్వచ్ఛ భారత్, స్వచ్ఛాం ధ్ర పట్ల అవగాహన గురించి ఆరా తీశారు. విద్యార్థులు బసచేసే వసతి సము దాయా లన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు చేతుల పరి శుభ్రత, పరిసరాల పరిశుభ్రత తదితర వాటిపై అన్ని రకాలుగా బృందం పరిశీలించి తగు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో పాఠశాలకు రాష్ట్రస్థాయిలో అవార్డు రావడం గమనార్హం. మొత్తమ్మీద గుండ్లకుంట గురుకుల పాఠశాల రాష్ట్రస్థాయి స్వచ్ఛ అవార్డు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ ఎం.సుజాత, ఉపాధ్యాయులు, సిబ్బందితో పాటు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





పాఠశాల ఆవరణలో అందంగా కనిపిస్తున్న సిమెంటురోడ్డు, మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

## త్వరలోనే రైతులకు పంట నష్టపరిహారం

● పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



లక్ష్మీనారాయణరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీటెక్ రవి

లింగాల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పెనుగాలుల వల్ల నష్టపోయిన అరటి రైతులకు త్వరలోనే ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో పంట నష్టపరిహారాన్ని జమ చేయనుందని నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. లింగాల మండలం కోమన్నూతల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణరెడ్డి కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం బీటెక్ రవి వారి ఇంటికెళ్లి కిరణ్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. లక్ష్మీనారాయణరెడ్డిని, అతని కుమారుడు నవీన్‌రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా అరటి రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ గురించి ఆయన రైతులతో మాట్లాడారు. ఆయన వెంట వేంపల్లె టీడీపీ మండల పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, లింగాల మండల టీడీపీ నాయకులు సంజీవ్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి ఉన్నారు.

## భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న శివస్వామి

కడప మారుతీనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నగర 49వ డివిజన్ ఆలంఖాన్‌పల్లెలోని దస్తగిరిపేటలో వెలసిన మానస మహాకాళీ శక్తి పీఠంలో భక్తులకు సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు శక్తిపీఠం గురువు శివస్వామి ఆధ్వర్యంలో ఆలయంలో మహాచండీ రుద్ర సహిత గణపతి, నవగ్రహ, లక్ష్మి కుబేరహోమంతో పాటు సువాసినీ పూజ కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హోమం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



## మార్కెట్ యార్డు కార్యాలయానికి తాళం

● ఈనాం వ్యాపారం వద్దని రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న మార్కెట్ యార్డు చైర్మన్ అమర్‌నాథ్‌యాదవ్

పులివెందుల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మార్కెట్ యార్డులో చీనీ వ్యాపారం ఈనాం పద్ధతిలో కాకుండా పాతపద్ధతి అయిన వేలంపాటల ద్వారా సాగించాలని రైతులు మార్కెట్ యార్డు కార్యాలయానికి సోమవారం తాళం వేశారు. సోమవారం నుంచి ఈనాం (ఆన్‌లైన్ మార్కెట్) ద్వారా చీనీ వ్యాపారం సాగిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో మార్కెట్‌యార్డుకు చేరుకున్న రైతులు ఈనాం వ్యాపారం వద్దని ఇది రైతులకు ఇబ్బందిగా ఉంటుందని కొంతమంది రైతులు మార్కెట్‌యార్డు కార్యాలయానికి తాళంవేశారు. విషయం తెలుసుకున్న మార్కెట్ యార్డు చైర్మన్ గడ్డం అమర్‌నాథ్‌యాదవ్, మార్కెటింగ్ శాఖ ఏడీ అజాద్ వలి, సెక్రటరీ శ్రీధర్‌లు అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. ఈనాం పద్ధతి అధికారులకు, వ్యాపారులకు లాభం కలిగిస్తుంది తప్ప రైతులకు ఎటువంటి లాభం లేదని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు మార్కెట్ యార్డు చైర్మన్ అమర్‌నాథ్ యాదవ్ మాట్లాడుతూ రైతులకు మెరుగైన ధరలు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈనాం పద్ధతి తీసుకొచ్చామని, ప్రారంభం రోజునే ఆందోళన చేస్తే ఉపయోగం ఏముంటుందని ఆయన ప్రశ్నించారు. దీనిపై రైతులకు అవగాహన లేకపోతే ప్రస్తుతానికి పాత పద్ధతిలోనే వేలంపాట దారా వ్యాపారాలు సాగిస్తామని, ఇంకో వారానికో, పదిరోజులకో ఈనాం పద్ధతి తప్పక అమలు చేస్తామన్నారు. అది అమలైతేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు.

## బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

● ఏపీ గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి



కలెక్టరుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కడప మారుతీనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పరిధిలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి సొరకాయల శివశంకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్‌సెల్ కార్యక్రమంలో కలెక్టరును కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు వీలుగా ప్రభుత్వం త్వరితగతిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే నకిలీ ఎస్టీ బోగస్ సర్టిఫికెట్ పొంది ఉద్యోగాలు చేస్తున్న ఇతర వర్గాల వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక

వీరపునాయునిపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు నూతన గ్రామ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండలంలోని ఉరుటూరు గ్రామంలో రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరం కిషోర్ బృందం ఆధ్వర్యంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తమాసు సుధాకర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. గ్రామ అధ్యక్షుడిగా వర్రా వినోద్‌కుమార్, గౌరవాధ్యక్షుడు గొర్రె శేఖర్, ఏసోబు, రాజేష్, మండలాధ్యక్షుడు ఇల్లూరు మనేష్, గౌరవాధ్యక్షుడు దానం, వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు ఎన్నికయ్యారు. గ్రామ ప్రజలు పాల్గొని జయప్రదం చేశారు.

## ఘనంగా పురస్కార ప్రదానం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ నాటక సంస్థ సవేరా ఆర్ట్స్ వ్యవస్థాపకుడు ఆల్లూరి వెంకటయ్య స్మారక పురస్కార ప్రదానోత్సవం కడప నగరం నేక్‌నామ్ ఖాన్ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఇంటాక్, సవేరా ఆర్ట్స్, పోతుల చిన్న ఓబులరెడ్డి, కంచమ్మ సరస్వతమ్మ మెమోరియల్ ట్రస్ట్, చాంద్‌బీ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించారు. నాటక రంగంలో సేవలందించిన సినీ, రంగస్థల నటి డాక్టర్ జి.రత్నశ్రీ, లలిత కళల విభాగంలో కృషి చేసిన వైవీయూ ప్రొఫెసర్ డాక్టర్ కోట మృత్యుంజయరావు ఈ ఏడాది పురస్కార గ్రహీతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ఇంటాక్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, లయన్ పి.ఖాసింఖాన్‌లు మాట్లాడారు. అనంతరం కూచిపూడి నృత్య పోటీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పలువురు కళాభిమానులు పాల్గొన్నారు.

## కార్మికులను తొలగించడం చట్టవ్యతిరేకం



కార్మికులతో మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) నందు గత 20ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించడం, కార్మిక చట్టాలకు వ్యతిరేకమని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి అన్నారు. నూతనంగా శానిటేషన్, సెక్యూరిటీ ఏజెన్సీ బాధ్యతలను చేపట్టనున్న ఓ ప్రైవేట్ సంస్థ ఇందులో పనిచేస్తున్న కార్మికులను తొలగించాలని చూస్తుందని, కార్మికులను తొలగించాలని చూస్తుందని, కార్మికులను తొలగించడాన్ని ఏమాత్రం సహించబోమని రవిశంకర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ విషయమై సోమవారం సర్వజన ఆసుపత్రి నందు కార్మికులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రిమ్స్ నందు పనిచేస్తున్న కార్మికులకు కార్మిక చట్ట ప్రకారం వేతనాలు అందడం లేదని, అందులోను కూడా ఈఎస్ఐ, పీఎఫ్‌లలో గోల్మాల్ జరుగుతున్నాయని, నెలనెల వేతనాలు అందించడంలో తీవ్ర జాప్యం నెలకొంటుందని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు.

## యానాదికాలనీలో ఉచిత వైద్యశిబిరం



ప్రజలను పరీక్షిస్తున్న వైద్యబృందం

చెన్నూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనగర్‌లోని యానాదికాలనీలో ప్రజలు జ్వరాలబారిన పడడంతో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వారిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఐ.శివారెడ్డిలు ఆ ప్రాంతాన్ని సందర్శించి అవసరమైన సహకారం అందించారు. వైసీపీ నేత సుబ్బారెడ్డి వారికి భోజన సదుపాయం అందించారు.

## డ్రగ్స్ రహిత సమాజానికి సమష్టి కృషి : ఎస్ఐ



మాట్లాడుతున్న ఎస్ఐ

కడప క్రైం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌రహిత సమాజానికి ప్రతిఒక్కరూ పాటుపడాలని తాలుకా ఎస్ఐ తులసి నాగప్రసాద్ అన్నారు. సోమవారం ఎస్పీఆదేశాల మేరకు కడప తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో పోలీసు కళాజాత శక్తి టీం, నార్కోటిక్ టీం, ఈగల్ సెల్ సంయుక్తంగా విద్యార్థులకు డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈగల్ పేరుతో ఒక ప్రత్యేక బృందం ఏర్పాటు చేసిందన్నారు. మాదక ద్రవ్యాలు వాడకం, అమ్మకం చట్టప్రకారం నేరమని, ఎవరైనా డ్రగ్స్ విక్రయాలు జరుపుతుంటే వెంటనే 1972 టోల్‌ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, ఫ్యాక్షన్ జోన్ ఎస్ఐ, కళాజాత ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యం, శక్తిటీం, నార్కోటిక్ సెల్ మల్లయ్య, ఈగల్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## ఆసక్తికరంగా ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

కడపస్పోర్ట్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ కడప మండల క్రీడల్లో భాగంగా సోమవారం నగర డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ఆసక్తికరంగా సాగాయి. ఇందులో బ్యాడ్మింటన్, చెస్, కబడ్డీ, యోగా పోటీలు రసవత్తరంగా సాగినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీలు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి, మండల కోఆర్డినేటరు ఎ.మహబూబ్‌బాషా వెల్లడించారు. పై క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు వారు తెలిపారు.

**కమలాపురం రూరల్:** అండర్-14, 17 విభాగాలకు స్కూలు గేమ్స్‌లో భాగంగా బాలబాలికలకు ఈ నెల 8 నుంచి 10వ తేది వరకు కమలాపురం మండల స్థాయిలో క్రీడాపోటీల ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కమలాపురం స్పోర్ట్స్ కోఆర్డినేటరు పీడీజే.వెంకటసుబ్బన్న తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న కమలాపురం గురుకుల ఉన్నత పాఠశాలలో కబడ్డీ, చెస్, యోగా, బ్యాడ్మింటన్ విభాగాల్లో ఎంపిక జరుగుతుందని, 9న ఖోఖో, వాలీబాల్, 10న అథ్లెటిక్స్ విభాగంలో ఎంపికలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు ఉదయం 9 లోపు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 9989861038 నెంబరును సంప్రదించాలని కోరారు.

**వల్లూరులో:** మండల స్థాయిలో ఈ నెల 8 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు గంగాయపల్లె జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో జరగబోయే ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు సంబంధించి పోటీలు నిర్వహణ ఎలా చేయాలన్న అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయి క్రీడా పోటీలు 8న ఉదయం కబడ్డీ, మధ్యాహ్నం బ్యాడ్మింటన్, 9న ఖోఖో, చెస్ పోటీలు గంగాయపల్లె పాఠశాలలో జరుగుతాయి. 10న వాలీబాల్ వేదాస్ పాఠశాలలో, 14న యోగా, అథ్లెటిక్స్ పోటీలు గంగాయపల్లె ఉన్నత పాఠశాలలో జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎజాజ్ అహ్మద్, దిలీప్ చక్రవర్తి, సుశీలమ్మ, వెంకటేశ్ తదితర పీఈటీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి: సీపీఎం

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మానికి అవమానం జరిగిందన్న పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది దాడి చేయడం హేయమైన చర్య అని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ అన్నారు. కోర్టులో అందరూ చూస్తుండగానే చెప్పు విసరటం దేశంలో నెలకొన్న దుస్థితికి అద్దం పడుతోందన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

## డెంగ్యూ జ్వరాలపై చర్యలు తీసుకోవాలి

● కమిషనర్‌కు కార్పొరేటర్ల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్లు

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో డెంగ్యూ, మలేరియా జ్వరాలు పెరుగుతున్నాయని దీనిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పాకా సురేష్, షంషీర్ డిమాండ్ చేశారు. సోమవారం కడప కార్పొరేషన్‌లో కమిషనర్ మనోజ్‌రెడ్డికి వారు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఇటీవల డెంగ్యూ, మలేరియా విషజ్వరాల కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అప్రమత్తత కల్పించాలన్నారు. దోమల ప్రభావాన్ని అరికట్టేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అవసరమైతే ఫాగింగ్, లార్వా నిరోధక చర్యలను తక్షణం చేపట్టాలని కోరారు. నగరంలో శానిటేషన్ చర్యలను మరింత బలోపేతం చేయాలని కమిషనర్‌ను వారు విజ్ఞప్తి చేశారు.

## ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

● ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ నేతలు

కడప మారుతీనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు వేతనాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆ మేరకు ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా సమితి పిలుపుమేరకు మంగళవారం నిర్వహించే ఆశాడే సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గల డాక్టర్లకు వినతిపత్రాల అందజేత కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. సోమవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, ఉపాధ్యక్షురాలు అనసూయ, కోశాధికారి అమ్ములు పాల్గొన్నారు.

## వరిని మద్దతు ధరతో కొనుగోలు చేయాలి

వేంపల్లె, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని మద్దతు ధరతో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని పులివెందుల మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. వేంపల్లె వ్యవసాయ అధికారి శివశంకర్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. వేంపల్లె, ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లె, కుమ్మరాంపల్లె, అలిరెడ్డిపల్లె, తదితర గ్రామాల్లో వరిని విస్తారంగా పండించారని, సివిల్ సప్లై ద్వారా కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు నాయకులు వెంకటనారాయణరెడ్డి, శంకరయ్య, గంగాధర్ ఉన్నారు.

## ఇంటి స్థలాలకు దరఖాస్తు చేసుకోండి

కడప మారుతీనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటిస్థలాలు లేని అర్హులైన మాజీ సైనికులు, వీరనారీమణులు, మాజీ పారామిలటరీ జవాన్లు దరఖాస్తు చేసుకోవాలని ది జై జవాన్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగు సొసైటీ చైర్మన్ వి.గోవర్ధన్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక సింహపురి కాలనీలోని ఆ సొసైటీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సొసైటీ ప్రతినిధులు వెంకటరమణ, నాగేంద్రరెడ్డి, రాఘవాచారి, ధనుంజయ, వెంకటేశ్వర్‌రావు, భానుప్రతాప్, క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ సదస్సును జయప్రదం చేయండి

కడప మారుతీనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 16న రాయలసీమ 8 జిల్లాలతో కూడిన సమావేశం జరగనుందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగారురావు, జిల్లా కార్యదర్శి ఓబయ్యలు వెల్లడించారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వేమన, జిల్లా నాయకులు చంద్రశేఖర్, సభ్యులు జకరయ్య, అనిల్ పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలోని సమస్యలు పరిష్కరించాలి

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్



సమావేశంలో సమస్యలను తెలుపుతున్న కౌన్సిలర్ జానీ

జమ్మలమడుగు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపల్ పరిధి లో నెలకొన్న సమస్యలను సత్వరం పరి ష్కరించాలని కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. మున్సిపల్ సర్వసభ్య సమావేశం సోమవారం ఛైర్‌పర్సన్ శివమ్మ అధ్య క్షతన మున్సిపల్ కార్యాలయ సభాభవనం లో జరిగింది. ఈసందర్భంగా మున్సిపల్ వైస్‌ఛైర్మన్-2 శింగరయ్య మాట్లాడుతూ జమ్మలమడుగులో డ్రైనేజీ కాలువలు పైన మూతలు లేక ప్రమాదకరంగా మారాయన్నారు. కౌన్సిలర్ ముల్లాజానీ మాట్లాడుతూ గూడుమస్తాన్‌వలి దర్గా సమీపాన సమస్యలు పరిష్కరించడంతోపాటు పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. కమిషనర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగులో పందుల యజమానులు దౌర్జన్యం చేస్తున్నారని, గతంలో సైతం సిబ్బందిపై దాడులు చేశారని, అందరూ సహకరిస్తే చర్యలు తీసుకుంటామని కౌన్సిలర్లకు తెలిపారు. మరో కౌన్సిలర్ మునిసుబ్బారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు, ఇరుకుగా మారి ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఛైర్‌పర్సన్ శివమ్మ మాట్లాడుతూ జమ్మలమడుగులో తిష్టవేసిన సమస్యలన్నీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు గజ్జల లక్షుమయ్య, ఫయాజ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్పీని కలిసిన భూపేశ్‌రెడ్డి



జమ్మలమడుగు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి సోమవారం కడపజిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా కడపజిల్లాలో జిల్లా ఎస్పీ వచ్చిన తర్వాత మొదటిసారిగా భూపేశ్‌రెడ్డి ఆయనను కలిసి స్థానిక పరిస్థితులపై మాట్లాడారు.

# కస్తూర్బా ప్రిన్సిపాల్‌కు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు

దువ్వూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దువ్వూరులోని కస్తూర్బా గాంధీ విద్యాలయం ప్రిన్సిపాల్ మల్లీశ్వరికి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు లభించింది. సోమవారం కడపలోని సభాభవనంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ విషయాన్ని ఆమె వెల్లడించారు.

# నూతన విద్యాశాఖ కార్యాలయం ప్రారంభం

కొండాపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ నూతన కార్యాలయాన్ని సోమవారం జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రారంభించారు. స్థానిక నచి వాలయం సమీపంలో నూతనంగా రూ.53 లక్షలతో నిర్మించిన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గండికోట ప్రాజెక్టు కింద పాత ఎంఈవో కార్యాలయం ముంపునకు గురి కావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏడాది లోపే రికార్డుస్థాయిలో నూతన విద్యాశాఖ కార్యాలయాన్ని నిర్మించడం జరిగందన్నారు. ఈ కార్యక్ర మంలో మండల కూటమి ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి, ఎంపీడీవో నాగప్రసాద్, ఎంఈ వోలు ఓబులేసు, రామయ్య, టీచర్ రాజులు, మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, కూటమి నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, బాబురెడ్డి, పద్మజ, గోరిశెట్టిబాబు తదితరులు పాల్గొన్నారు

# మంత్రి నాదెండ్లను కలిసిన జనసేన నాయకులు

మైదుకూరు అక్టోబరు06(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాలు, మానవ వనరుల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను మైదుకూరు జనసేన నాయకులు మర్యాద పూర్వకంగా తెనాలిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి స్థానిక సమస్యలను వివరించారు. వారి వినతులను విన్న మంత్రి పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని సలహా లు సూచనలు ఇచ్చారు. ఈనెలాఖరు నుంచి పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాయలసీమలో పార్టీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ తో ప్రజల ముందుకు వస్తారని తెలిపారు. కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారన్నారు. ఆయను కలిసిన వారిలో జనసేన నాయకులు క్రిష్ణమూర్తి, రామగో విందు, ఈశ్వరయ్య, ప్రవీణ్ ఉన్నారు.

# విద్యార్థులు సామాజిక సేవను అలవర్చుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సామాజిక సేవను అలవర్చుకోవాలని కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని మత్స్యకాలనీలో ఎస్‌సీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు వారం రోజులపాటు తమ పంచాయతీ పరిధిలోని మత్స్యకాలనీలో వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆఫీసర్ వెంకటరాముడు, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

# పేదల సంక్షేమానికే సీఎం సహాయ నిధి మంజూరు



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం సీఎం సహాయ నిధిని మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పలు రకాల వైద్య చికిత్సలు పొంది సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న 99 మందికి రూ. 49,49.044 ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మె ల్యే వరదరాజులరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం వచ్చిన ఈ 15 నెలలకాలంలోనే 12 విడతలుగా సీఎం సహాయనిధి మంజూరు అయిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సీఎం సహాయనిధి మంజూరులో కూడా భారీ కుంభకోణం జరిగిందని విమర్శించారు. రాజు పాళెం మండలం గాదె గూడూరు గ్రామానికి చెందిన గోన అభిషేక్ అనే వ్యక్తికి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం రూ.10లక్షలు ఎల్‌వోసి ఇప్పించామ న్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షులు ఘంటశాల వెంకటేశ్వర్లు, ఈవీ సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ కమాల్ బాషా , మాజీ కౌన్సిలర్ వద్ది బాలుడు, సోమా బాలయ్య, సూర్యనారాయణ రెడ్డి లక్ష్మీపేట గురివి రెడ్డి, సానా వెంకటసుబ్బారెడ్డి, సిద్దయ్య, పగిడాల సుబ్బారెడ్డి ఇట్టేసునీల్ తదితరులు పాల్గొన్నారు.

# రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో రామాలయ దేవస్థానం నిర్మాణానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి భూమిపూజ నిర్వహించారు. సోమవారం ఉదయం గ్రామంలోని స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కల్లూరులో రామాలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.30 లక్షలు నిధులు మంజూరయ్యాయి. దీంతో ఎమ్మెల్యే పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆనందభార్గవరెడ్డి, చల్లా రాజగోపాల్‌యాదవ్, లింగాపురం ఏజీఆర్ బ్యాంకు ఛైర్మన్ సిద్దారెడ్డి నాగమునిరెడ్డి, అర్కటవేముల క్రిష్టారెడ్డి, స్థానిక నాయకులు నిరంజన్‌రెడ్డి, నరసింహరావు, మునెయ్య, వెంకటసుబ్బయ్య, వై.వెంకటసుబ్బయ్య, యు.శ్రీనివాసులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలి

జమ్మలమడుగు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు వెంటనే పెండింగ్ వేతనాలు మంజూరు చే యాలని సంఘం నాయకు లు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఏవో ఇక్బాల్‌కు వారొక వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న తమకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అధికారులు సమస్యను జిల్లా అధికారులకు తెలియజేయాలని కోరారు. కాంట్రాక్టర్ తమపట్ల నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. సంబందిత సబ్‌కాంట్రాక్టర్ శరత్‌పై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీవోనెం.549 ప్రకారం రూ.16 వేలు వేతనం ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.11,800 మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా తమకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ విస్తరణాధికారిగా రామ్‌చరణ్

దువ్వూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ గ్రామ సహాయకుడిగా పనిచేస్తున్న రామ్‌చరణ్ విస్తరణాధికారి పదోన్నతి పొందాడు. ఈయన మండలంలోని మాచనపల్లెకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా అందుబాటులో ఉండి సహకరిస్తానని తెలిపారు.

# అర్హులందరికి భూపంపిణీ చేయాలి

కాశినాయన అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ భూపం పిణీ చేయాలని సీపీఐ నాయకుడు అన్వేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు సోమవారం నర్సాపురం తహసీల్దారు కార్యాలయంలో నాయనపల్లె, వరికుంట్ల, సావిశెట్టిపల్లె తదితర గ్రామాలకు చెందిన భూమిలేని పేదలతో కలిసి తహసీల్దారు వెంకటసుబ్బయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయనపల్లె రెవెన్యూ పొలంలో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని ఇప్ప టికే తహసీల్దారుకు పలు మార్లు అర్జీలు అందజేశామన్నారు. కానీ రెవెన్యూ అధికా రులు అర్హులను గుర్తించడంలో కాలయాపన చేయడం తగదన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఈనెల 13వ తేదీ నుంచి తహసీల్దారు కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల నేత పోలయ్య పలువురు భూమిలేని పేదలు పాల్గొన్నారు.

# భారీ వర్షం.. ఇబ్బందుల్లో జనం

బద్వేలుటౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు పట్టణంలో సోమవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని మైదుకూరురోడ్డు జాతీయ రహదారిలోని స్టేట్‌బ్యాంకు వద్ద, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద జాతీయ రహదారి పూర్తిగా చెరువును తలపించే విధంగా నీరుచేరాయి. అలాగే గుంతపల్లె క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిలో నీరు నిలవడంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీగ్యారేజ్, రామాంజనేయనగర్, ప్రభుత్వాసుపత్రి రహదారి పూర్తిగా జలమయం కావడంతో ఆసుపత్రికి వెళ్లాలన్నా రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ గ్యారేజీలో సుమారు మోకాలులోతు నీరు నిల్వ ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వెంకటయ్యనగర్‌లోని సబ్‌స్టేషన్ పక్కవీధిలో, త్యాగరాజుకాలనీలో, మార్కెట్‌యార్డు సమీపంలో రోడ్లన్నీ వర్షపునీటితో నిండిపోయాయి. ఏ రహదారిలో నీరు ఎటూపోలేని దుస్థితి ఏర్పడటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలుకోరుతున్నారు.



బద్వేలు ప్రభుత్వాసుపత్రి వద్ద రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు

### జలమయమైన ప్రాంతాల పరిశీలన

వర్షానికి రోడ్లన్నీ జలమయం కావడంతో బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలు ఆర్టీసీ గ్యారేజీలో నిల్వ ఉన్న నీటిని, ప్రధాన రహదారులను పరిశీలించారు. వెంటనే సిబ్బందిని పంపి నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

### జమ్మలమడుగులో పలుచోట్ల నిలిచిన నీరు

జమ్మలమడుగు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ఆదివారం రాత్రి తెల్లవారుజాము నుంచి ఉదయం 9.30 గంటల వరకు ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో జమ్మలమడుగులోని లోతట్టు ప్రాంతాల్లో, గుంతల రోడ్లలో భారీగా వర్షంనీరు నిలిచింది. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా రోడ్డు దారుణంగా మారింది. నడిచి వెళ్లాలంటే ఎర్రమట్టి బురద బట్టలపై పడి పాదాచారులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే మోరగుడి, పెద్దదండ్లూరు, తదితర గ్రామాల్లో వర్షపునీరు రోడ్లపై నిలిచి ఆ ప్రాంతాలవారు ఇబ్బందులు పడ్డారు.

**కొండాపురంలో:**మండలంలో పలుచోట్ల సోమవారం తెల్లవారుజామున నుంచి వర్షం కురిసింది. కొండాపురం పట్టణంలో ఓ మోస్తరు వర్షం కురియగా, గ్రామాల్లో అంతంతా మాత్రమే వర్షం కురిసిందని స్థానికులు తెలిపారు. కాగా కొండాపురం పట్టణంలో పలుచోట్ల వాగులు, వంకలు ప్రవహించాయి.

**ఎర్రగుంట్లలో:** ఎర్రగుంట్లలో ఆదివారం రాత్రి బారీ వర్షం కురిసింది. 43ఎంఎం వర్షపాతం నమోదు అయ్యింది. రబీపంటలు వేసేందుకు రైతులు పొలాల్లో ఎరువులు విత్తుతున్నారు. అయితే వర్షం కావడం వల్ల మినుము పంటలు వేసేవారికి ఉపయోగకరంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

**కాశినాయనలో:** కాశినాయన మండలంలో 2.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఇన్‌చార్జి ఏఎస్‌వో వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం తెల్లవారు జామున ప్రారంభమైన వర్షం దాదాపు 2గంటలకు పైగా పడుతూనే ఉంది.ఈవర్షం మూలంగా భూగర్భ జలాలు తక్కువగా ఉన్న ఆకులనారాయణపల్లె వరికుంట్ల, బాలాయపల్లె, గొంటువారిపల్లె తదితర గ్రామాల పరిధిలో పండ్లతోటలతో పాటు ఇతర పంటలకు కొంత ఊరటనిచ్చినట్లైందని మండల వ్యవసాయ విస్తరణాధికారి రవికుమార్‌రెడ్డి తెలిపారు.

## జాతీయ రహదారి పైకి వర్షం నీరు

మైదుకూరు అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): మైదుకూరులో పడిన వర్షానికి ఎర్ర చెరువు నిండి అలుగు ప్రవహించడంతో వర్షం నీరంతా పట్టణంలో బళ్లారి నుంచి క్రిష్ణపట్నం వెళ్లే 167బి జాతీయ రహదారిపై ప్రవహించింది. అలు గు వంక ఆక్రమణలకు గురికావడంతో నీరు పోయేందుకు వీలు లేక శీలం నగర్‌లోని ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. సిండి కేట్ సొసైటీ ఎరువుల గోదాములలోకి నీరు చేరుతుండడంతో స్థానిక టీడీపీ నేత ఆకుల క్రిష్ణయ్య మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఏఈ తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని పర్యవేక్షించారు.

## ఎమ్మార్పీఎస్ సమీక్ష సమావేశం

బి.కోడూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరులో సోమవారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీ ఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జి ఈశ్వరయ్య హాజరై మాట్లాడుతూ ఈ నెల 15న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ అధ్యక్షుడు మందక్రిష్ణమాదిగ పర్యటన ఉందని కార్యక్రమాన్ని ఎమ్మార్పీసెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గంగరాజు, నరసింహులు, జయచంద్ర, గురయ్య, నరసయ్య సుబ్బయ్య, యాగప్ప, రామచంద్రయ్య పాల్గొన్నారు.

## డివిజన్‌లో నమోదైన వర్షపాతం

జమ్మలమడుగు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలో సోమవారం నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపురం 93.2 మిమీ వర్షపాతం కురిసింది. మైలవరంలో 28.6, పెద్దముడియంలో 23.4, రాజుపాళెంలో 17.2, దువ్వూరులో 47.8, చాపాడులో 45.8, ప్రొద్దుటూరులో 44.6, జమ్మలమడుగులో 14.6, ముద్దనూరులో 41.4 మిమీ వర్షపాతం నమోదు అయింది. డివిజన్‌లో మొత్తం వర్షపాతం 399.6 మిమీ వర్షపాతం నమోదు అయింది.





కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆది చేతుల మీదుగా స్వచ్ఛాంధ్ర అవార్డు అందుకుంటున్న జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ

## 10 వరకు ఉచిత ఆధార్ క్యాంపులు

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ప్రొద్దుటూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.కిరణ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10వ తేదీ వరకు జరిగే జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆధార్ క్యాంపులను నిర్వహిస్తూ ప్రొద్దుటూరు డివిజన్ ప్రజలకు సౌకర్యవంతమైన ఆధార్ నమోదు అప్‌డేట్ సేవలను అందిస్తామన్నారు. అక్టోబరు 8 నుంచి 14వ తేదీ వరకు డివిజన్ అంతటా ఆధార్ క్యాంపులను నిర్వవహిస్తున్నామని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం అదనంగా ప్రొద్దుటూరు హోమస్‌పేట సబ్‌పోస్టాఫీసు, జమ్మలమడుగు సబ్‌పోస్టాఫీసు, పులివెందుల హెడ్‌ఆఫీసులలో కూడా ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

## పరిశుద్ధ జపమాలాగ్ని గ్రామోత్సవం

పోరుమామిళ్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలో పరిశుద్ధ జపమాలారాగ్ని గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓఎల్ఎఫ్ హైస్కూలు సమీపంలో ఉన్న పరిశుద్ధ జపమాలాగ్ని మహోత్సవ కార్యక్రమం సందర్భంగా సోమవారం అంబేడ్కర్ సర్కిల్ నుంచి ప్రధాన రహదారుల గుండా క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేసి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలతో అర్హులు లబ్ధి పొందాలి

పోరుమామిళ్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరూ లబ్ధి పొందాలని పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ అన్నారు. సోమవారం ఆ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీకి సంబంధించిన కూలీలు, రైతులు ఉపాధి హామీ పథకం ఉపయోగాలు తెలుసుకుని వాటిని లబ్ధి పొందాలన్నారు. ఎంపీడీవో ఉపేంద్రారెడ్డి మాట్లాడుతూ ఉపాధి పథకం కింద ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులకు పండ్ల మొక్కలు సరఫరా చేస్తామని రైతులు ఏ మొక్కలు నాటుకుంటారో అవి తమ దృష్టికితేవాలన్నారు. అలాగే పంట కాల్వలు, బీడు భూముల్లో చెట్లు నాటించేందుక ఈ పథకాలు ఎంతో ఉపయెగమన్నారు. కార్యక్రమంలో ఏపీవో రవీంద్రరెడ్డి, టెక్నికల్ అసిస్టెంటు, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు.

## లైసెన్సు పొందిన చోటే షాపులు ఏర్పాటు చేయాలి

పోరుమామిళ్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): లైసెన్సు పొందిన ప్రదేశాల్లోనే టపాసుల షాపులు ఏర్పాటు చేయాలని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డిలు తెలిపారు. సోమవారం పోరుమామిళ్లలో టపాసుల అమ్మకం కేంద్రాలను గోడౌన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫైర్‌క్రాకర్స్ షాపులు, గోదాముల యజమానులు తప్పనిసరిగా సూచనలు పాటించాలన్నారు. గోడౌన్ల వద్ద ఎక్కువ జనసంచారం ఉండరాదని, షాపుల వద్ద బకెట్లు, నీళ్లు, ఇసుక బకెట్లు తప్పకుండా ఉంచాలన్నారు. షాపులకువిద్యుత్ వైరింగ్, సురక్షితంగా ఉండాలన్నారు. షాపుల వద్ద బ్యానర్లు, హెచ్చరిక్క బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.











## జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన

బద్వేలు, అక్టోబర్6, ఆంధ్రజ్యోతి :పట్టణంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి మెప్మా సిబ్బందితో కలిసి జీఎస్టీ ఏ విధంగా వర్తిస్తుందో అవగాహన కల్పించారు. అలాగే జీఎస్టీ రేట్ల పట్టిక బోర్డులు ఏర్పాటు చేయాలని, వస్తువుల ధరలను బోర్డుపై ఉంచాలని సూచించారు. రేట్లలో ఏదైనా తేడా ఉంటే ప్రజలు జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.



## మెరుగైన వైద్య సేవలందించడానికి కృషి

ప్రొద్దుటూరు , అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి) : ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రి లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి శాయశక్తుల కృషి చేస్తానని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుజాత ఇటీవల బాధ్యతలు స్వీక రించారు. గతంలో పనిచేసిన రూపానంద్ సూపరింటెండెంట్‌గా రిలీవ్ అయ్యి డాక్టర్ సుజాతకు బాధ్యతలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజాత మాట్లాడుతూ తానుగతంలో బనగానపల్లెలో పనిచేశానన్నారు. ఇక్కడికి వచ్చాక జిల్లా ఆసుపత్రిలో డాక్టర్ల కొరతతో పాటు నర్సింగ్ సిబ్బం ది కొరత ఉందన్నారు. ప్రతి వార్డులో రోగులకు మంచి వైద్యం అందేలా కృషి చేస్తామన్నారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలను గుర్తించి ఒక్కొక్కటిగా పరిష్కారం చేస్తానన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యం

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష అన్నారు. సోమవారం స్థానిక శ్రీనివాసనగర్‌లో ఓటు చోరీ అంశంపై కరపత్రాలతో ఇంటింట ప్రచార కార్యక్రమంతోపాటు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర యువనేత రాహుల్‌గాంధీ, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిళా రెడ్డి పిలుపుమేరకు ఈ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.